


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మౌనరాగాలు

**ఊళ్ళో ఉంటే ప్రతీరోజూ** టంచన్‌గా ఎనిమిది గంటలకల్లా బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చునే అనంతరావు ఆ రోజు తొమ్మిదిన్నరైనా కిందకి రాకపోవడంతో వంటావిడ కీడు శంకించింది. కొంచెం తటపటాయించినా మనసూరుకోక మెట్లెక్కి పైకెళ్ళి యజమానురాలి గది తలుపు తట్టింది.

అప్పటికే బయటకి వెళ్ళడానికి తయారైన ప్రమద్వర చెవికి కమ్మలు పెట్టుకుంటూ తలుపు తీసింది. విషయం విని కంగారుగా భర్త గది తలుపు తోసి లోపలికి  వెళ్ళింది. ఆ విశాలమైన మంచం మీద అనంతరావు దీర్ఘ నిద్రపోతున్నాడు.

పదిహేను రోజుల తర్వాత అనంతరావు మిత్రుడు, లాయర్ అయిన స్వామి నించి ప్రమద్వరకి ఫోన్ వచ్చింది.

"చెల్లాయ్. శనివారం సాయంత్రం వస్తాను. పిల్లలు ముగ్గుర్ని నా కోసం ఇంట్లోనే ఉండమను" చెప్పాడు.

"ఆయన నాలుగేళ్ళ క్రితమే వీలునామా రాసారుగా?" ప్రమద్వర సందిగ్ధంగా అడిగింది.

"అందులో మార్పులేదు. ఓ ముఖ్యమైన విషయం చెప్పాలని."

"సరే. అందరం మీకోసం ఇంట్లోనే ఉంటాం" ప్రమద్వర అంగీకారంగా చెప్పింది.

"మీ నలుగురు మాత్రం చాలు. కోడళ్ళు, అల్లుడు వద్దు."

"సరే."

ఆమె దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు. కాని తన ముగ్గురు పిల్లలకి ఆ సమయంలో ఇంట్లో ఉండాలని, స్వామి వస్తానన్నాడని మెసేజ్ చేసింది.

"ఎలా ఉన్నారంతా?" స్వామి సానుభూతిగా అడిగాడు.

ప్రమద్వర తలదించుకుంది.

"చాలా షాకింగ్ అంకుల్. ఇంత సడెన్‌గా నాన్న.." అనంతరావు పెద్దకొడుకు విషాదంగా చెప్పాడు.

"అసలు నమ్మబుద్ధికావడం లేదంకుల్" రెండో కొడుకు చెప్పాడు.

కూతురు నీలిమ కళ్ళవెంట నీరు కారుతూంటే, మాట్లాడలేక తల అడ్డంగా ఊపింది.

స్వామి తన బేగ్‌లోంచి ఓ కవర్ బయటకి తీసి చెప్పాడు.

"వీలునామా రాసిన రోజే రావ్ ఈ కవర్‌ని నాకిచ్చాడు. తను పోయాక కుటుంబ సభ్యుల సమక్షంలో దీన్ని చదవమన్నాడు. నాకు సీల్డ్ కవర్ ఇచ్చాడు కాబట్టి ఇందులో ఏముందో నాకు కూడా తెలీదు. విప్పి చదవమంటారా?"

అంతా తలలూపారు. స్వామి ఆ కవర్‌ని కత్తిరించి తెరిచి అందులోంచి అనంతరావు లెటర్ హెడ్ కాగితాన్ని బయటకి తీసాడు. అది ఒకే పేజ్. పేజీకి ఒక వైపే రాసాడు.

స్వామి గొంతు సవరించుకుని ఇంగ్లీష్‌లో రాసిన దాన్ని చదవసాగాడు.

'మైడియర్ ఫేమిలీ,

ఈ ఉత్తరాన్ని నేను సంపూర్ణ ఆరోగ్యంతో, మన మధ్య రహస్యాలు ఉండకూడదనే ఉద్దేశంతో రాస్తున్నాను. నాకు తెలుసు మీరంతా మంచివాళ్ళు కాబట్టి నాన్న కోరికని తిరస్కరించరు.

నేను ఐదేళ్ళ క్రితం రోడ్ నంబర్ 36లో ఓ ఇండిపెండెంట్ బంగ్లాని నలభై కోట్లకి కొన్నాను. ఆ సంగతి అప్పుడు మీకు చెప్పాను కాని 'అంతా నాన్న చూసుకుంటారు కదా' అని మీరు దాన్ని పట్టించుకోలేదు. నిన్న నేను విల్లు రాస్తున్నానని, అంతా దాన్ని విని ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పమని కోరాను. 'మీ ఇష్టం' అని మీరంతా సమాధానాలు చెప్పారు. ప్రమద్వర ఎప్పుడూ నా మాటని వ్యతిరేకించలేదు. అలాగే మౌనంగా ఉండిపోయింది.

నేను సంపాదించిన స్థిర చరాస్తుల లిస్ట్ మీకు వివరించి, ఎవరెవరికి ఏమేం చెందుతాయో చెప్పినప్పుడు మీరంతా అందుకు అంగీకారం తెలిపారు. ఇప్పుడు దాదాపు డెబ్బై కోట్ల మార్కెట్ వేల్యూ ఉన్న ఆ ఇంటి గురించి మీరెవరూ ప్రశ్నించలేదు. బహుశా మీకది గుర్తులేదు. కానీ గుర్తొచ్చినప్పుడు నాన్న దాన్ని ఏం చేసాడో అనే అనుమానం మీకు రాకుండా ఈ ఉత్తరం రాస్తున్నాను.

ఆ ఇంటిని నేను నా స్నేహితురాలు ఆముక్త దాస్‌కి రాస్తున్నాను. ఆ వివరాలు, విల్ కాపీ ఆముక్తకి ఇవ్వబోతున్నాను...'

స్వామి చదవడం ఆపేసాడు. అంతా నిర్ఘాంతపోయి చూస్తున్నారు. ప్రమద్వరకి ఉక్రోషంతో ఏడుపు వచ్చింది.

స్వామి మళ్ళీ చదవడం ఆరంభించాడు.

"మీ నలుగురు నాకు నాలుగు ప్రాణాలైతే, ఆముక్త ఐదో ప్రాణం. తనకి నేను ఇచ్చినదానికంటే, తీసుకున్నది ఎక్కువ. నా మంచి స్నేహితురాలు. కాబట్టి ఈ విషయంలో ఆమెని ఇబ్బంది పెట్టకండి. ఆస్తి అంతా నా స్వార్జితమే ఐనా నా కుటుంబానికి తెలియాలని ఇది రాస్తున్నాను.

**మీ అనంతరావు.”**

ఆ గదిలో నిశ్శబ్దం అలముకుంది. స్వామి ఒక నిమిషం వేచివుండి తర్వాత లేస్తూ చెప్పాడు.

"అనంతరావ్‌లో ఈ కోణం నేను ఎదురు చూడనిది. ఇంక వస్తా."

"అంకుల్ దయచేసి ఈ విషయం మనమధ్యే ఉండనివ్వండి. నలుగురికి తెలిసి నాన్నగురించి నవ్వుకుంటే మేం భరించలేం" అనంతరావు పెద్ద కొడుకు లేచి స్వామికి షేక్‌హేండ్ ఇస్తూ చెప్పాడు.

"అవును. ఇది మా నలుగురి మధ్యే ఉంటుంది. మా భాగస్వాములకి చెప్పాల్సిన అవసరం కూడా లేదు" రెండో కొడుకు చెప్పాడు.

నీలిమ అవునన్నట్లు తలాడించింది. ప్రమద్వర లేచి గదిలోంచి బయటకి వెళ్ళిపోయింది.

"అమ్మకి ప్రస్తుతం ఏకాంతం అవసరం తన గదిలోకి వెళ్ళకు" పెద్దకొడుకు చెల్లితో చెప్పాడు.

నీలిమ స్వామికి నమస్కారం చేసి వెళ్ళిపోయింది. ఆమెకి  మనసంతా బాధగా ఉంది. 'నాన్న కూడానా?' అనే ప్రశ్న ఆమెని ఇబ్బంది పెడుతోంది. కుటుంబంలో చిన్నపిల్లగా, ఆడపిల్లగా తండ్రినించి అపారమైన ప్రేమని పొందిన ఆమె ఆయనకి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉందన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోయింది.

"ఏంటిట మీ రౌండ్ టేబుల్ సమావేశం సారాంశం?" పడకగదిలో మంచం మీద పడుకుని టి.వి చూసే ఆమె భర్త అడిగాడు.

"మీకు సంబంధించింది కాదు" ముభావంగా చెప్పింది.

"తెలుసు. విషయం ఏమిటి?" అతను ఆసక్తిగా అడిగాడు.

నీలిమ ఏం మాట్లాడకపోవడంతో అతను తిరిగి ప్రశ్నించలేదు.

ఆ రోడ్ మీద నీలిమ నెమ్మదిగా కారు డ్రైవ్ చేస్తూ, అటూ ఇటూ చూడసాగింది. ఆ ముందు రోజు ఆమె స్వామికి ఫోన్ చేసి తండ్రి ఆముక్తదాస్‌కి గిఫ్ట్ ఇచ్చిన ఇంటి అడ్రస్ అడిగి తెలుసుకుంది.

"నువ్వెళ్ళి గొడవచేసి లాభం లేదు నీలిమా. మీ నాన్న ఆ విల్‌ని రిజిస్టర్ కూడా చేసి వుంటాడు" స్వామి హెచ్చరించాడు.

"ఛ! గొడవ చేయడానికి కాదంకుల్.." నీలిమ ఆగిపోయింది.

స్వామి ఆ చిరునామా ఆమెకి మెసేజ్ పంపాడు.

రోడ్‌కి కుడివైపు కొంచెం లోపలిగా ఉన్న ఇంటి గేట్ మీద నంబర్ చూసి అదే అని నిశ్చయించుకుంది. దాని ముందు కారాపి, గేట్ తీసుకుని లోపలికి వెళ్ళింది. ఇంటి తలుపు పక్కన 'అ ఆ' అని అందంగా రాసి వుంది.

అంటే అనంతరావు ఆముక్త అని అర్ధమైన నీలిమకి గుండెల్లో మంటగా అనిపించింది.

ఆ రోజు తన గదిలోకి వెళ్ళిన ప్రమద్వర రాత్రి తొమ్మిదికి బయటకి వచ్చింది. ముభావంగా భోజనం చేసి వెళ్ళిపోయింది. ఇంట్లో అంతా నటిస్తున్నట్లు ఉన్నారని నీలిమకి అనిపించింది. స్వామిని అడిగి అడ్రస్ తీసుకుని వచ్చింది. కాని ఎందుకు వచ్చిందో ఆమెకే సరిగ్గా తెలీదు.

ఓ క్షణం తటపటాయించి కాలింగ్ బెల్ నొక్కింది. రెండు నిమిషాల తర్వాత తలుపు తెరుచుకుంది.

తల్లి వయసే ఉన్న ఒకామె తలుపు తీసి ఎదురుగా ఉన్న నీలిమని చూసి నివ్వెరపోయింది. వెంటనే ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నీలిమ చేతిని గట్టిగా పట్టుకుంది. ఆ పట్టులో ఆమె దుఃఖాన్ని నిగ్రహించుకుంటోందని నీలిమ గ్రహించింది.

"రా లోపలికి" ఆమె నీలిమ చేతిని వదలకుండా పక్కనే నడుస్తూ లోపలకి తీసుకెళ్ళింది.

లోపలి విశాలమైన హాల్‌లో సోఫాలో కూర్చోపెట్టి మృదువుగా చెప్పింది.

"నీ రాకని నేను ఊహించలేదు."

నీలిమ ఓ క్షణం సిగ్గుపడింది.

"నా గురించి ఎలా తెలుసు? అనంత్ చెప్పాడా?" ఆవిడ ప్రశ్నించింది.

"నాన్న ఈ ఇంటిని మీ పేరు మీద రాసారని తెలిసింది. నాన్న జీవితంలోని ఆ ఐదో ప్రాణం ఎవరో చూద్దామని వచ్చాను" నీలిమ ఉక్రోషంగా చెప్పింది.

ఆముక్త ముఖం చిన్నబోయింది.

"నాకు వద్దని అనంత్‌కి చాలా నచ్చ చెప్పాను. కాని వినలేదు. తన గుర్తుగా నన్ను ఈ ఇంట్లోనే ఉండిపొమ్మన్నాడు" చెప్పింది.

"ఈ ఆస్తి కోసం రాలేదండి. మా అమ్మ అప్పటినించి ఎంత బాధపడుతోందో. భర్త జీవితంలో ఇంకో ఆడది ఉంటే ఎవరికైనా బాధే కదా? అమ్మలో లేనిది మీలో ఏం చూసారు నాన్న అని చూద్దామని వచ్చాను. ఆయన కోరికని కాదని మిమ్మల్ని ఇంట్లోంచి గెంటేయాలని కాదు. చెప్పండి నాన్నకి ఏ విధమైన సాంత్వన ఇచ్చారు?" నీలిమ కోపంగా ప్రశ్నించింది.

"ఆయన్ని విన్నాను" ఆముక్త నెమ్మదిగా చెప్పింది.

"వాట్?" నీలిమ ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఆయన్ని విన్నాను. నువ్వు పెళ్ళయ్యాక మీ నాన్నతో మునుపటిలా కబుర్లు చెప్పావా?"

"నో" నీలిమ తటపటాయించి చెప్పింది.

"అనంత్, నేను సూరత్‌కల్‌లో కలిసి చదువుకున్నాం. అప్పుడే ఫ్రెండ్స్ అయ్యాం. నాలుగేళ్ళ చదువు అయ్యాక పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం. అనంత్ వాళ్ళది తెలంగాణాలో ఉన్నత కులమైతే, ఒరియా వాళ్ళమైన మాది దిగువ కులం. మీ తాతయ్య, అనంత్ వాళ్ళ నాన్న మా పెళ్ళికి ఇష్టపడలేదు. వాళ్ళమ్మ, నా పేరెంట్స్ ఒప్పుకున్నారు కాని, మీ తాతయ్య 'ఈ పెళ్ళయితే ఇంక నువ్వు చచ్చినట్లే లెక్క. నా ఇంట్లో అడుగు పెట్టద్దు' అనేసారు. మేం చాలా సంఘర్షణ పడ్డాం. నీకు తెలుసుగా మీ నాన్న ఒక్కడే సంతానం. మీ నాయనమ్మ నీలమ్మకి పుత్రశోకం కలిగించకూడదని వాళ్ళ నాన్న చెప్పిన ప్రమద్వరని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత మేం టచ్‌లో లేం.

నేను ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్స్ రాసి పాసై కలకత్తాలో పోస్టింగ్ వస్తే వెళ్ళిపోయాను. ఓ సివిల్ సర్వెంట్ నన్ను పెళ్ళిచేసుకున్నాడు. అతను లౌక్యుడు. చాలా త్వరగా పైకి ఎదిగాడు. నెమ్మదిగా ఉండే నేను అతని వేగాన్ని అందుకోలేకపోయాను. గోపాల్‌పూర్‌లో చంద్ర గ్రహణం చూద్దామని తీసుకెళ్ళి ఆ బీచ్‌లో చెప్పాడు 'మనం విడిపోదాం' అని.

ఆ తర్వాత నేను జోన్ మార్చుకుని సౌత్‌కి మారాను. మద్రాస్‌లో పదిహేనేళ్ళు పనిచేసాను. అనంత్ చాలా విచిత్రంగా తారసపడ్డాడు.

అతను బిజినెస్ పార్టనర్స్‌ని కలవడానికి వచ్చిన రెస్టరెంట్‌కే నేను వెళ్ళాను. మళ్ళీ మా స్నేహం కొనసాగింది. అనంత్ బలవంతం మీద వి ఆర్ తీసుకుని ఇక్కడికి వచ్చేసా" ఆముక్త ఒక్క క్షణం ఆగి ఊపిరి పీల్చుకుని చెప్పింది.

"ఇది మా గతం . ఇలాంటి ఫ్లాష్ బేక్స్ చాలామందికి ఉంటాయి. ముఖ్యంగా నాలాంటి దురదృష్టవంతులకి."

ఆ తాత నీలిమకి గుర్తే. ఆయన కోపం కూడా తెలుసు. పాపం నాన్న! అనుకుంది.

"మీరేదో విన్నాను అన్నారు?" సందేహంగా అడిగింది.

"మేం మళ్ళీ కలిసిన కొత్తలో అనంత్ నన్ను అడిగాడు 'మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చుగా' అని.

'ఓ లవ్ ఫెయిల్యూర్, ఓ ఫెయిలైన పెళ్ళి. ఈ జన్మకి ఈ అనుభవాలు చాలు' అని చెప్పాను.

'నేనూ అంత సుఖంగా లేను' అని చెప్పాడు నేను ఆశ్చర్యపోయాను."

"నాన్న సుఖంగా లేనన్నారా? అదేంటి? ఎందుకు? మిమ్మల్ని పెళ్ళి చేసుకోలేదనా?" నీలిమ ఉద్రేకంగా అడిగింది.

ఆముక్త తల అడ్డంగా తిప్పుతూ చెప్పింది.

"కాదు. అనంత్ నన్ను దాదాపు మర్చిపోయాడు."

"మరి?"

"నీలూ నువ్వు పెళ్ళయిన అమ్మాయివే. నీకు చెప్పచ్చు అనుకుంటున్నా.

అనంత్ చాలా సెన్సిటివ్ మనిషి. తనకి మనుషులు కావాలి. తను ఒక్కడే సంతానమై ఏం కోల్పోయాడో తెలుసు కాబట్టి ముగ్గురు పిల్లల్ని కన్నాడు. అంతా ఉమ్మడిగా ఉండాలని కోరుకున్నాడు. మీరూ అలాగే ఉండిపోయారు. మీతోనే లోకంగా ఉన్నాడు. ఊహూ మొదట మీ అమ్మనించి మొదలు పెడతాను."

"మా అమ్మ గురించేముంది? నాన్న మా అమ్మ రాక్షసి అని చెప్పారా? అమ్మ చాలా మంచిది. నాన్న మాటకి అసలు ఎదురు చెప్పదు."

"ఛ! అలా ఎందుకు చెప్తాడు? ప్రమద్వర మంచిదే. కాని వ్యక్తిగా మంచితనం వేరు. భార్యగా లేదా భర్తగా మంచితనం వేరు. అనంత్ ఫేమిలీ మేన్. తన కుటుంబం తప్ప అతనికి వేరే ధ్యాస లేదు. అతని స్థాయిలోని వ్యక్తుల్లో ఉండే ఏ దుర్లక్షణాలు అనంత్‌లో లేవు. తను ఎంత ఇస్తున్నాడో అంత పొందాలని అతని కోరిక. ఇంకా చాలా కోరికలు ఉన్నాయనుకో. అందులో ఒకటి మీ అమ్మతో కబుర్లు చెప్పడం. పగలంతా పనిలో బిజీగా ఉన్నా, సాయంత్రానికి ఇల్లు చేరి రిలాక్సయ్యాక భార్యతో కబుర్లు చెప్పాలని అన్నది ఆశ. బిజినెస్ మొదలు పెట్టిన కొత్తల్లో ప్రమద్వరతో ఓ రాత్రి ఉత్సాహంగా చెప్పాడు.

"ఇవాళ ఆఫీస్‌లో ఏం జరిగిందో తెలుసా?"

"నాకా మాటలు విసుగు. ఇంటికి ఆఫీస్‌ని తీసుకురావద్దు ప్లీజ్." ప్రమద్వర జవాబు.

"నాతో కలిసి తినచ్చుగా?"

"మీరు టి.వి పెడితే ఊరుకోరు. కబుర్లు చెప్పుకుంటూ తిందాం అంటారు. రోజూ ఏం కబుర్లు ఉంటాయి? బోర్. ఐనా మగాళ్ళు ఆడాళ్ళలా గాసిపింగ్ చేస్తే నాకిష్టముండదు. "

అనంత్‌కి తన వ్యాపార విజయాల గురించిచి భార్యకి చెప్పాలి అని కోరిక. ఆమె ఏనాడూ వినలేదు. కొంత ఎదిగాక ఆ అరిస్టోక్రసీని మెయిన్‌టెయిన్ చేయడానికి తనకంటూ సెపరేట్ బెడ్‌రూం అలవాటు చేసుకుంది. అనంత్ నివ్వెరపోయాడు. అలా వద్దన్నాడు. వినలేదు. కుటుంబంతో కటువుగా ప్రవర్తించడం అతనికి చేతగాదు. ఎప్పట్లాగానే మౌనంగా ఉండిపోయాడు."

నీలిమకి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"పూర్వం రాజులు ఆ రాత్రి ఏ రాణి దగ్గరకి వెళ్తారో ఆమెకి ముందే కబురు చేసేవారుట. ఆ విధంగా ఆ రాత్రి నేను ప్రమద్వరకి కబురు చేయాలా అనుకున్నాను. ఊరుకున్నాను. నాకు కోరిక కలిగినప్పుడు కాక ఆమెకి కోరిక కలిగినప్పుడు వచ్చేది" అన్నాడు అనంత్. తర్వాత పిల్లలతో అనుబంధం పెంచుకున్నాడు. మీతో ఫ్రెండ్‌లా మెలిగాడు. ముఖ్యంగా నీతో. తన అమ్మ నీలమ్మ పేరు పెట్టుకున్న నిన్ను అమ్మా అనే పిలిచావాడు కదా?"

నీలిమ కన్నీళ్ళతో తల ఊపింది.

"మీరు పెద్దయి మీకు పెళ్ళిళ్ళయ్యాక సహజంగానే ప్రయారిటీస్ మారాయి. అనంత్ అందుకు బాధపడలేదు కాని బాగా వంటరితనం ఫీలయ్యాడు. అప్పుడే నన్ను ఇక్కడికి వచ్చెయ్యమని గొడవ చేసాడు. నేను వచ్చేసాను. రోజూ సాయంత్రం నాలుగునించి ఏడుదాకా అనంత్ నా దగ్గర ఉండేవాడు. ఎన్ని కబుర్లు చెప్పేవాడో తెలుసా? చిన్నప్పుడు చెరువులో ఈతకి వెళ్తే వాళ్ళ నాన్న కొట్టిన విషయం, ఆఫీస్ తెరిచిన కొత్తల్లో కుర్రాడని ఎకౌంటెంట్ చేసిన మోసం, నువ్వు నాలుగేళ్ళప్పుడు ఆడుకుంటూ పడి ముందు పన్ను విరగ్గొట్టుకుంటే, ఇంక నీకు శాశ్వతంగా పన్నుండదని ఏడ్చిన సంగతి, అది విని డాక్టర్ విరిగింది పాలపన్ను. పర్మినెంట్ పన్ను వస్తుందని ఓదార్చడం.. మీ అమ్మకి చెప్పాలనుకుని చెప్పలేని సంగతులన్నీ చెప్పేవాడు. మీ ఫోటోలు వీడియోలు చూపించేవాడు. నేను మెచ్చుకుంటే ఆనందపడేవాడు . వంటమనిషికి ఫలానాది వండమని చెప్పడానికి మొహమాటం కాబట్టి తనకి కావాల్సినవి నన్ను వండమనేవాడు. నేను వచ్చాకే తన జీవితం సంపూర్ణమైందని సంతోషించేవాడు. భార్య తనతో ఆఫీస్‌కి వచ్చి ఛైర్ పర్సన్‌గా ఉంటే బాగుండనుకునేవాడు. కాని ఆమె సోషలైట్. ఫ్రెండ్స్‌తో ఏక్టివిటీస్ ఎక్కువ. మిగిలినవన్నీ బోర్. సొసైటీ లేడీగా లైమ్ లైట్‌లో ఉండేది.

"నాకు అనంత్ అంటే అపారమైన ప్రేమ. అతను చెప్పే కబుర్లు శ్రద్ధగా వినేదాన్ని. సందేహాలొస్తే అడిగేదాన్ని. దానికి చాలా సంతోషపడేవాడు. నా పిల్లలకి పిల్లలు పుడితే వాళ్ళతో గడుపుతాను, నీతోకాదు అని చెప్పాడు.'సరే' అంటే"

.... ఆముక్త డగ్గుత్తికగా ఆగిపోయింది. తర్వాత చెప్పింది.

"నేను సరే అంటే, నువ్వు నా ఐదో ప్రాణం. నా ప్రాణం పోయాకే నిన్ను వదిలేది అన్నాడు. ఇంత మంచి లైఫ్ ఉన్న నాకు చావంటే భయం. నా ఫేమిలీ అంతా చుట్టూ ఉండగా ప్రశాంతంగా పోవాలి అనేవాడు. అందుకు చాలా టైముంది అనేదాన్ని."

నీలిమ కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నయి. ఆముక్తని కౌగలించుకుని చెప్పింది.

"మీరు నాన్నకి ఎంత ఓదార్పునిచ్చారో నాకర్థమైంది. మేం ప్రేమాస్పదుడైన నాన్నగా చూసాం. అమ్మ సమర్థుడైన భర్తగా చూసింది. కానీ ఓ మనిషిగా సామాన్య కోరికలు కూడా తీరని గొప్ప బిజినెస్ మేగ్నెట్ అనంత్‌రావ్‌ని అతని చివరి రోజుల్లో చూసుకున్న దేవత మీరు. ఔను. అమ్మ నాన్న రూమ్ లో ఉంటే ఆ అర్థరాత్రి ఆయనకి అసౌకర్యంగా ఉన్నప్పుడు డాక్టర్ని పిలిచేదిగా అనుకున్నాను. ఇంతమందిమి ఉండి ఎవరూ లేకుండా వంటరిగా వెళ్ళిపోయారు. జీవితాన్నీ మనుషుల్ని ఇంతగా ప్రేమించిన నాన్న అందుకు ఎంత బాధ పడివుంటారో!" తర్వాత కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

"వస్తానండి. నేను కూడా ఏదైనా చెప్పుకోవాలంటే మీ దగ్గరకే వస్తాను. అమ్మకి చెప్పను కాని ఇదంతా అన్నయ్యలకి చెప్తాను. నాన్న మా ఇంట్లో కంటే స్వేచ్ఛగా, ఆనందగా జీవించిన ఈ ఇంటిని ఇలాగే ఉంచండి. కనీసం నాన్న ఆ ఒక్క కోరికైనా తీరనివ్వండి"

వెళ్తున్న నీలిమని చూస్తున్న ఆముక్త కళ్ళల్లో నీళ్ళు.

'విన్నావా అనంత్' గొణిగింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments